దివ్యాంగుల సమస్యలు వింటూ పరిష్కారం కోసం చేయాల్సిన పోరాటం గురించి చర్చిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. చిత్రంలో దివ్యాంగుల సమాఖ్య ప్రతినిధులు

దివ్యాంగులకు కాంగ్రెస్ దగా

- ఏడాది దాటినా రూ.6వేల పింఛన్ అమలు కాలె..
- కేసీఆర్ హయాంలోనే పింఛన్ల పెంపు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులను మోసగించిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ దివ్యాంగుల సమాఖ్య సంఘం ప్రతినిధులు హైదరాబాద్‌లోని నివాసంలో ఎమ్మెల్సీ కవితను కలిశారు. రాష్ట్రం ఏర్పడే నాటికి రూ.500 ఉన్న దివ్యాంగుల పింఛన్‌ను రూ.4,000కు కేసీఆర్ పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తుచేశారు. దివ్యాంగులకు దేశంలోనే అత్యధికంగా పింఛన్ అందించిన రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించిందని తెలిపారు. దివ్యాంగుల స్వయం ఉపాధి కోసం సబ్సిడీ రుణాలు, దివ్యాంగుల సంక్షేమ బడ్జెట్‌ను నాలుగు రెట్లు పెంచడం లాంటి అనేక గొప్ప కార్యక్రమాలను కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిందని పేర్కొన్నారు. అయితే, దివ్యాంగులకు రూ.6,000 పింఛన్ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఏడాది దాటినా అమలు చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌డబ్ల్యూపీడీ 2016 చట్టాన్ని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని, దివ్యాంగులకు రిజర్వేషన్లను కూడా సరైన రీతిలో అమలు చేయటం లేదని ధ్వజమెత్తారు. దివ్యాంగులకు డబుల్ బెడ్రూం ఇండ్లు, సబ్సిడీ రుణాలు, పింఛన్ల పెంపు వంటి అంశాలపై మండలిలో చర్చించాలని, తెలంగాణ దివ్యాంగుల సమాఖ్య సంఘం ప్రతినిధులు ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం అందజేశారు. వారి వెంట శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నేత చిర్ర రవీందర్‌యాదవ్ ఉన్నారు.

నేలపై కూర్చుని దివ్యాంగుడితో ఆత్మీయంగా మాట్లాడుతున్న కవిత

రాష్ట్రంలో లౌకికత్వాన్ని పరిరక్షించాలి

రాష్ట్రంలో లౌకికత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరముందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. లౌకికవ్యతిరేక శక్తులపై తాము పోరాటం చేస్తూనే ఉంటామని తెలిపారు. లౌకికత్వాన్ని పరిరక్షించేందుకు కేసీఆర్ ఎనలేని కృషి చేశారని, భవిష్యత్తులోనూ అదే పంథాలో ముందుకెళ్తారని స్పష్టంచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలనలో పలు ప్రాంతాల్లో ఐక్యతకు బీటలువారాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజల ప్రశాంత జీవనానికి విఘాతం కలిగించిందని విమర్శించారు. తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడె రాజీవ్ సాగర్, క్రిస్టియన్ జేఏసీ అధ్యక్షుడు సాల్మన్‌రాజ్ నేతృత్వంలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు కవితను ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలో లౌకికతత్వ పరిరక్షణపై రాజకీయాలకు అతీతంగా చర్చ జరగాలని ఆకాంక్షించారు. బీజేపీ ప్రోత్సహిస్తున్న విద్వేశానికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. క్రిస్టియన్లకు బీఆర్ఎస్ రాజకీయంగా చాలా అవకాశాలు ఇచ్చిందని గుర్తుచేశారు. కవితను కలిసిన వారిలో క్రిస్టియన్ సంఘాల ప్రతినిధులు శామ్ అబ్రహం, జేకబ్, జవహర్ కెన్నెడీ, ఇజ్రెల్, దేవదానం, సాపా శ్రీనివాస్, అరవింద్, మేజర్ ఫిలిప్ రాజ్, హేమా సునీల్ ఉన్నారు.

బీసీ రిజర్వేషన్ల కోసం పోరుకు సిద్ధం

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల పెంపుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆధ్వర్యంలో గంగపుత్ర సంఘం నేతలు ఎమ్మెల్సీ కవితను ఆమె నివాసంలో కలిశారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు కులగణనపై నివేదిక ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ బీసీ మహిళలకు కోటా కల్పించాలని కూడా పోరాటం చేస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న బీసీ ఉద్యమాలకు తాము మద్దతు ఇస్తున్నామని వివరించారు. ఏ అంశాన్ని తీసుకున్నా ఇప్పటివరకు వెనుకడుగు వేయకుండా పోరాటం చేశామని గుర్తుచేశారు. గతంలో తెలంగాణ జాగృతి చాలా సామాజిక అంశాలపై పోరాటం చేసిందని ఉదహరించారు.



అక్రమ కేసులే ఏడో గ్యారెంటీనా?

సమైక్య పాలనలో కాంగ్రెస్ నిరంకుశత్వాన్ని ఎదిరిస్తే వందల కేసులు పెట్టినా హరీశ్‌రావు భయపడలేదు. రేవంత్‌రెడ్డీ.. ఇప్పుడు నీ తాటాకు చప్పుళ్లకు హరీశ్ బెదిరిపోరు. రెండు అక్రమ కేసులు పెట్టి భయపెట్టాలనుకుంటే అది నీ అవివేకమే. అక్రమ కేసులు పెట్టడమే మీరు గొప్పగా చెప్పుకుంటున్న ఏడో గ్యారెంటీనా? ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటే ఇదేనా?

- డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కోరుట్ల ఎమ్మెల్యే

కావాలనే హరీశ్‌పై కేసు

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ఏడాది పాలన వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు అండగా నిలుస్తున్న హరీశ్‌రావుపై కావాలనే కేసు నమోదు చేశారు. ప్రభుత్వ కక్ష పూరిత చర్యలను ప్రజలు గమనిస్తున్నరు. తగిన సమయంలో బుద్ధి చెప్తరు. రేవంత్ సర్కార్ కేసులు, బెదిరింపులకు బీఆర్ఎస్ నాయకులు భయపడరు. ఎంత అణగదొక్కాలని చూసినా కాంగ్రెస్ వైఫల్యాలను బట్టబయలు చేస్తూనే ఉంటం.

- పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే

కేసులతో భయపెట్టలేరు

అక్రమ కేసులు పెట్టి ప్రశ్నించే గొంతుకలను భయపెట్టాలనుకుంటే అంతకన్నా మూర్ఖత్వం మరోటి ఉండదు. హరీశ్‌రావుపై అక్రమ కేసు పెట్టడం అప్రజాస్వామికం. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ఏడాది పూర్తయినా ఏమీ చేయలేదు. పాలనలో అకృత్యాలు నిత్యకృత్యమైనయ్. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే హామీల అమలుపై దృష్టి పెట్టాలి.

- పెద్ది సుదర్శన్‌రెడ్డి, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే

నికింద్రాబాద్‌లోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో గాడ్ విజన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

హరీశ్‌పై సర్కార్ కుట్ర!

- ప్రశ్నిస్తున్నందుకు హరీశ్‌పై పగ!
- కేసులతో బెదిరించే యత్నం
- ఇప్పటికే ఐదు కేసులు నమోదు
- కాంగ్రెస్ నేత ఫిర్యాదుతో ఫోన్ ట్యాపింగ్ పైనే మళ్లీ కేసు
- లక్ష కేసులు పెట్టినా ప్రశ్నించడం ఆపను: హరీశ్

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న మాజీ మంత్రి హరీశ్ రావును అక్రమ కేసుల్లో ఇరికించేందుకు కుట్ర జరుగుతున్నదా? ప్రస్తుత పరిణామాలను పరిశీలిస్తే 'అవును' అనే సమాధానాలు వినిపిస్తున్నాయి. తాజాగా తన ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో హరీశ్‌రావుపై కేసు నమోదైంది. సిద్దిపేట కాంగ్రెస్ ఇన్‌చార్జి, అసెంబ్లీ ఎన్నికల్లో హరీశ్‌రావుపై పోటీ చేసిన అభ్యర్థి ఫిర్యాదు చేయడాన్ని బట్టి ఇది రాజకీయ కుట్ర అని తెలుస్తున్నదని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారు. చక్రధర్ ఈ అంశంలో ఓసారి ఫిర్యాదు చేశారని, తీరా హైకోర్టు విచారణకు వెళ్లిన తర్వాత పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారని, ఇదే అంశంపై కేసు నమోదు చేయడాన్ని బట్టి ప్రభుత్వం కావాలనే హరీశ్‌రావును ఇబ్బంది పెట్టే కుట్ర చేస్తున్నదని మండిపడుతున్నారు. హరీశ్‌ను టార్గెట్ చేస్తూ ఇప్పటివరకు ఐదు కేసులు నమోదు చేశారని, ఇవన్నీ రాజకీయ ప్రేరేపితమేనని చెప్తున్నారు.

ఫోన్ ట్యాపింగ్‌పైనే మళ్లీ మళ్లీ

చక్రధర్ తన ఫోన్ ట్యాపింగ్ అయ్యిందంటూ గతంలోనే హరీశ్‌రావుపై కేసు పెట్టారు. తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారంటూ నిరుడు ఆగస్టు 29న తనకు ఆపిల్ కంపెనీ నుంచి మెయిల్ వచ్చిందని ఈ ఏడాది జూన్ 19న డీజీపీకి ఫిర్యాదు చేశారు. తర్వాత పోలీసులు పట్టించుకోవడం లేదని హైకోర్టును ఆశ్రయించారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, హరీశ్‌రావును ప్రతివాదులుగా చేర్చుతూ జూలై 16న రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు విచారణకు స్వీకరించిన తర్వాత నవంబర్ 22న చక్రధర్ తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. మళ్లీ ఇదే అంశంపై పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చక్రధర్‌కు హరీశ్‌పై అనుమానం ఉంటే రిట్ పిటిషన్‌ను ఎందుకు ఉపసంహరించుకున్నారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. హరీశ్‌రావు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ద్వంద్వ నీతిని వీడియో ఆధారాలతో సహా బయటపెట్టిన నేపథ్యంలోనే కక్షతో మంగళవారం కొత్తగా కేసు నమోదు చేయించారని ఆరోపిస్తున్నారు.

ఇప్పటికే నాలుగు కేసులు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హరీశ్‌పై నాలుగు కేసులు నమోదయ్యాయి. రైతులకు ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తానని రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిపై ఒట్టేసి మాట తప్పారని హరీశ్‌రావు ఆగస్టు 22న యాదగిరిగుట్ట ఆలయంలో శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఆయనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రెండో కేసు ఈ ఏడాది అక్టోబర్ 4న సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. మంత్రి కొండా సురేఖకు బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు నూలుపోగు దండ వేయడంపై ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. నిందితుడి సోషల్ మీడియాలో హరీశ్ ఫొటో కనిపించిందనే సాకుతో కేసు నమోదు చేశారని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారు. మూడో కేసు ఈ ఏడాది అక్టోబర్ 25న బేగంబజార్‌లో నమోదైంది. హామీలను ఎగవేస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డిని 'ఎగవేతల రేవంత్‌రెడ్డి' అని సంభోదించినందుకు హరీశ్‌పై కేసు నమోదు చేశారు. నాలుగో కేసు కరీంనగర్‌లో నవంబర్ 25న నమోదైంది. ఓ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డిని విమర్శించారన్న కారణంతో కేసు నమోదు చేశారు.

లోపాలు బయటపెడుతున్నందుకే!

కాంగ్రెస్ పాలనా లోపాలను, రేవంత్ నిర్ణయాలతో ప్రజలకు జరుగుతున్న నష్టాన్ని హరీశ్ ప్రజల ముందు పెడుతున్నారని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారు. రేవంత్‌కు హరీశ్ కొరకరాని కొయ్యగా మారారని పేర్కొంటున్నారు. రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి, మాట తప్పడంపై హరీశ్‌రావు పదేపదే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో రేవంత్‌ను సవాల్ చేయడంతో ఆగస్టు 15 నాటికి రుణమాఫీ చేస్తానని ప్రకటించక తప్పలేదు. అరకొర రుణమాఫీ చేయడంతో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పెద్దలకు తలనొప్పిగా మారింది. అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో తెలంగాణను ఉదాహరణగా చూపడంతో కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చదనే అభిప్రాయం ఆయా రాష్ట్రాల ఓటర్లలో కలిగింది. ఫలితంగా మహారాష్ట్రలో ఎదురుదెబ్బ తగిలిందని కాంగ్రెస్‌లోనే చర్చ నడుస్తున్నది. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, ఇరుకున పెడుతున్న హరీశ్‌ను నియంత్రించేందుకు ప్రభుత్వం కుట్రపన్నిందని, కేసులు పెట్టిందని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు.

హరీశ్‌రావుపై మరో కేసు నమోదు

- ఫోన్ ట్యాప్ చేశారంటూ కాంగ్రెస్ నేత ఫిర్యాదు
- పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- చక్రధర్‌గౌడ్ చరిత్రంతా నేరమయమే!
- ఆయనపై ఇప్పటికే 8 కేసులు

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ) / ఖైరతాబాద్, డిసెంబర్ 3 : మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తన ఫోన్ ట్యాప్ చేయించారని బాచుపల్లిలోని నిజాంపేట ప్రగతినగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు, పార్టీ సిద్దిపేట ఇన్‌చార్జి గదగోని చక్రధర్‌గౌడ్ చేసిన ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చక్రధర్‌గౌడ్‌పై గతంలో పలు కేసులు నమోదయ్యాయి. అదే క్రమంలో తన ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, అప్పటి నుంచి తన ఫోన్‌ను హ్యాక్ చేశారని ఫిర్యాదులో చక్రధర్‌గౌడ్ ఆరోపించారు. ఆ తర్వాత తనకు, తన కుటుంబ సభ్యులకు బెదిరింపు కాల్స్ వచ్చాయని, దీని వెనుక హరీశ్‌రావు, అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు ఉన్నారని, ఈ మేరకు వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

చక్రధర్‌గౌడ్‌ది నేర చరిత్రే!

సిద్దిపేట కాంగ్రెస్ ఇన్‌చార్జి చక్రధర్ గౌడ్ దారుణాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావుపై ఫోన్ ట్యాపింగ్ కేసు పెట్టించడంపై సిద్దిపేట ప్రజలు చక్రధర్‌గౌడ్‌పై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కొందరు బాధితులు ఆయన అక్రమాల చిట్టా విప్పేందుకు సిద్ధమవుతుండగా.. ఇప్పటికే ఆయన బారిన పడి అన్యాయానికి గురైన వారు కేసులు పెట్టేందుకు సంసిద్ధులయ్యారు. చక్రధర్‌గౌడ్ చరిత్ర మొత్తం నేరాలమయమేనని పలువురు స్పష్టం చేస్తున్నారు. ఈమేరకు ఆయనపై గతంలో నమోదైన కేసుల చిట్టాను బహిర్గతం చేశారు. 'చెల్లి' అంటూనే స్నేహితుడి భార్యపై చక్రధర్ గౌడ్ కన్నేసినట్టు గతంలోనే బాధితురాలు ఆవేదన వ్యక్తంచేశారు. తనకు ఇల్లు ఇస్తానని నమ్మబలికి, బాగా చూసుకుంటానని వంచించి ఆ మహిళపై అఘాయిత్యానికి పాల్పడినట్టు సోషల్ మీడియాలో బాధితురాలు కన్నీటి పర్యంతమైన వీడియో చక్కర్లు కొడుతున్నది. 'వద్దు అన్నా' అంటూ వేడుకున్నా కూడా చక్రధర్‌గౌడ్ బలవంతం చేసినట్టు బోరున విలపించింది. దీంతో మనస్తాపానికి గురై తాను ఆత్మహత్యాయత్నం చేసినట్టు చెప్తున్నది. ఆమె ఒక్కతే కాదని, మహిళలను వేధించి, లోబర్చుకోవడంలో చక్రధర్‌గౌడ్ దిట్ట అని సిద్దిపేటకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలే చెప్తున్నారు. ఆయనపైన పలుమార్లు నమోదైన కేసుల్లో కూడా అత్యాచార యత్నం కేసులు కూడా ఉన్నట్టు తెలిపారు.

చక్రధర్‌గౌడ్‌పై నమోదైన కేసుల చిట్టా

1) కత్తి, నేరపూరిత కుట్ర కేసులో క్రైమ్ నంబర్ 157/2006 కింద ఐపీసీ 120-బి, 489 ఏ, బీ, సీ, డీ సెక్షన్ల కింద సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

2) చీటింగ్, సైబర్ మోసానికి సంబంధించి క్రైమ్ నం.: 198/2014 కింద 66 (సీ&డీ) ఐటీ చట్టం 2008, 420 ఐపీసీ కింద సైబరాబాద్, సైబర్ క్రైమ్ పీఎస్‌లో కేసు నమోదైంది.

3) ఉద్దేశపూర్వకంగా బాధ కలిగించడం వంటి కేసులో క్రైమ్ నం.186/2018 కింద ఐపీసీ 324 ఆర్/డబ్ల్యూ 34 కింద సైబరాబాద్‌లోని బాచుపల్లి పీఎస్‌లో కేసు నమోదైంది.

4) హౌస్ ట్రాస్‌పాస్, అసాల్ట్, జెట్ స్టాండింగ్ మోడెస్టీ వంటి అభియోగాల కింద క్రైమ్ నం.141/2019లో ఐపీసీ 448, 323, 509 ఆర్/డబ్ల్యూ 34 సెక్షన్ల కింద బాచుపల్లి పీఎస్‌లో కేసు నమోదైంది.

5) ర్యాష్ డ్రైవింగ్, అంటువ్యాధి చట్టం ఉల్లంఘన కేసులో క్రైమ్ నం.217/2020లో ఐపీసీ 279, 188, 269, 3 ఈడీఏ, 185 ఎంవీ చట్టాల కింద సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

6) అత్యాచారానికి ప్రయత్నం చేసిన కేసులో క్రైమ్ నం.49/2023లో ఐపీసీ 376, 511 సెక్షన్ల కింద శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

7) దోపిడీ, కిడ్నాప్ ప్రయత్నం కేసులో క్రైమ్ నం.522/2023లో 392, 363 ఆర్/డబ్ల్యూ 511 & 34 ఐపీసీ సెక్షన్ల కింద రాచకొండ కమిషనరేట్‌లోని ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

8) జాయింట్ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్‌లో భాగంగా క్రైమ్ నం: 909/2023, 908/2023లో సైబర్ నేరాలు నమోదయ్యాయి. ఆ కేసులను టాస్క్ ఫోర్స్, సైబర్ క్రైమ్ పోలీసులు విచారిస్తున్నారు. ఆ కేసులు ప్రస్తుతం నాంపల్లిలోని 12వ మెట్రోపాలిటన్ కోర్టులో ఉన్నట్టు సమాచారం.

పిరికిపంద చర్య

కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపుతున్న హరీశ్‌రావును ఎదుర్కోలేకనే అక్రమ కేసులు పెడుతున్నరు. రేవంత్‌రెడ్డి రెండు నాల్కల ధోరణిని ఎండగడుతుంటే భయపడి కేసులు బనాయిస్తున్నరు. ఇది రేవంత్‌రెడ్డి పిరికి పంద చర్య. ఆయన ఉడత బెదిరింపులకు భయపడేవాళ్లు బీఆర్ఎస్‌లో ఎవరూ లేరు. ఎన్ని కేసులు పెట్టినా ప్రశ్నిస్తూనే ఉంటం.

- కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్

రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేకే

అసమర్థ పాలనపై ప్రశ్నిస్తున్న హరీశ్‌రావును రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేకనే రేవంత్‌రెడ్డి అక్రమ కేసులు పెడుతున్నడు. సవాళ్లు విసురుతున్నడని సంకెళ్లు వేయడం, పాలనా వైఫల్యాలను కడిగిపారేస్తున్నడని కారాగారంలో పెడదామనుకోవడం, జనాల ముందు తప్పులను ఎండగడుతున్నాడని జైలులో వేయాలనుకోవడం అవివేకం. ఆయన సంకెళ్లు వేస్తే సలాం చేసే వ్యక్తి కాదు.. మీ కాంగ్రెస్ కోటలను కబళించే శక్తి.

-ఎనుగుల రాకేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత

ఎండగడుతున్నందుకు హరీశ్‌రావుపై కక్ష

అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ విధానాలను ఎండగడుతున్నందుకు హరీశ్‌రావుపై రేవంత్‌రెడ్డి కక్షగట్టారు. పాలనలో వైఫల్యాలపై నిలదీస్తున్నందుకు, రేవంత్‌రెడ్డి ద్వంద్వ వైఖరిని బయటపెట్టినందుకు హరీశ్‌పై కావాలనే కేసు పెట్టారు. మీరు ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్‌లో బెదిరిపోయే వాళ్లు లేరు.

-పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే

కప్పిపుచ్చుకొనేందుకే

తప్పులను కప్పిపుచ్చుకొనేందుకే హరీశ్‌రావుపై కాంగ్రెస్ సర్కార్ అక్రమ కేసులు బనాయించింది, ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలని చూస్తున్నది. రేవంత్ సర్కారు ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజల పక్షాన కొట్లాడుతూనే ఉంటం. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే రేవంత్‌రెడ్డి రెండు నాల్కల ధోరణిని హరీశ్ ప్రజలముందు ఉంచినందుకే ఆయనపై అక్రమ కేసు పెట్టించిండ్రు.

-మేడె రాజీవ్ సాగర్, తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్

రేవంత్ నిరంకుశ వైఖరికి నిదర్శనం

హరీశ్‌పై అక్రమ కేసు పెట్టడం రేవంత్‌రెడ్డి నిరంకుశ వైఖరికి నిదర్శనం. ప్రజల పక్షాన నిలబడి, ప్రశ్నిస్తున్న గొంతును నొక్కే ప్రయత్నం చేయడం దుర్మార్గం. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి అదే ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతున్నారు. రేవంత్‌రెడ్డి నిరంకుశ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నం.

- ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్

ప్రశ్నించడమే పాపమైంది

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన అసమర్థతను కప్పిపుచ్చుకొనేందుకే హరీశ్‌రావుపై, బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నడు. ఈ నియంతృత్వ, అణచివేతల పాలనలో ప్రశ్నించడమే ఘోరమైన పాపంగా మారింది. రేవంత్‌రెడ్డీ..మీ దౌర్జన్యం ప్రజాస్వామిక హక్కులనే కాదు, తెలంగాణ ఆత్మను హరిస్తున్నది. నువ్వెంత భయపెట్టినా మేం తలవంచం, మౌనంగా ఉండబోం. ప్రతిఘటిస్తూనే ఉంటం.

- దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ నేత

రాష్ట్రాల డిమాండ్లు తీర్చలేం

- గోదావరి-కావేరి అనుసంధానంపై ఇక కేంద్రానిదే నిర్ణయం
- ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశంలో జల్‌శక్తి శాఖ స్పష్టీకరణ
- నెలాఖరులో ప్రత్యేక సమావేశం

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాల డిమాండ్లు తీర్చడం ఎట్టిపరిస్థితుల్లోనూ సాధ్యం కాదని కేంద్రం చేతులెత్తేసింది. గోదావరి-కావేరి అనుసంధాన (జీసీ లింక్) ప్రాజెక్టుపై కేంద్రమే నిర్ణయం తీసుకుంటుందని జల్‌శక్తి శాఖ స్పష్టం చేసింది. రివర్ లింకింగ్‌లో భాగమైన అన్ని రాష్ట్రాలతో ఈ నెలాఖరులో ఓ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపింది. జీసీ రివర్ లింక్ ప్రాజెక్టుపై నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) మంగళవారం ఢిల్లీ నుంచి హైబ్రిడ్‌మోడ్‌లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. ఛత్తీస్‌గఢ్ మినహా ప్రాజెక్టులో భాగమైన అన్ని రాష్ట్రాల అధికారులు హాజరయ్యారు. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర కొత్త ప్రతిపాదనలను తీసుకొచ్చాయి. కర్ణాటక తాగునీటి అవసరాలకు జీసీ లింకింగ్‌లో ఇదివరకే 16 టీఎంసీలను కేటాయించారు. తాజాగా ఆ రాష్ట్రం తమ సాగు అవసరాలకూ నీటిని కేటాయించాలని ప్రతిపాదించగా.. వైతరణి, దమనగంగ, గోదావరి లింక్ చేపట్టాలని మహారాష్ట్ర డిమాండ్ చేసింది. ఏపీ సైతం ఇచ్చంపల్లి నుంచి జీసీ అనుసంధానాన్ని పక్కనపెట్టాలని, పోలవరం నుంచి పెన్నా రీజియన్ ద్వారా కావేరి లింక్‌ను చేపట్టాలని పాతపాటనే పాడింది. జీసీ అనుసంధానంతో అందుబాటులో ఉండే 148 టీఎంసీల జలాల్లో వాటాగా 74 టీఎంసీలు ఇవ్వాలని తెలంగాణ అధికారులు తేల్చిచెప్పారు. 83 మీటర్ల ఎగువ నుంచే నీటిని తీసుకోవాలని, తక్కువ ఎత్తు నుంచి నీటిని తరలించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. సమ్మక్కసాగర్, దేవాదుల, సీతారామ ప్రాజెక్టులకు 152 టీఎంసీల జలాలను కేటాయించాలని, నదుల అనుసంధానంలో భాగంగా 20 టీఎంసీల చొప్పున 40 టీఎంసీల సామర్థ్యంతో 2 రిజర్వాయర్లను నిర్మించి ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

నీళ్లు ఎక్కడి నుంచి వస్తాయి?

రాష్ట్రాలు తమ ఇష్టం వచ్చినట్టు వాటాలు అడిగితే నీళ్లు ఎక్కడి నుంచి వస్తాయని కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి మహంతి అసహనం వ్యక్తం చేశారు. అందుబాటులో ఉన్నదే 148 టీఎంసీలని, రాష్ట్రాల డిమాండ్లను తీర్చాలంటే 400 టీఎంసీలైనా సరిపోవని పేర్కొన్నారు. ఈ నెలాఖరున సమావేశాన్ని నిర్వహించి జీసీ అనుసంధానంపై తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

7న వాహన బంద్ జరిపి తీరుతాం

- బంద్ విరమణకు ఒప్పుకోని జేఏసీ
- చర్చలు సఫలమైతే బంద్ విరమిస్తాం
- లేదంటే 7న నిర్వహిస్తం: జేఏసీ

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): ఈ నెల 7న వాహన బంద్ జరిపేందుకే తెలంగాణ ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల జేఏసీ నిర్ణయించింది. బంద్‌ను విరమించుకోవాలన్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వినతిని జేఏసీ తిరస్కరించింది. హామీలను ప్రభుత్వం విస్మరించిందని తేల్చిచెప్పింది. ఈ నెల 6న ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారంపై మరోసారి చర్చలు జరుపుతామని మంత్రి చెప్పారని జేఏసీ నేతలు వెల్లడించారు. ఈ చర్చల్లో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొంటారని చెప్పినట్టు తెలిపారు. చర్చలు సఫలమైతేనే